క్లుప్తంగా

వైభవంగా పల్లకీ సేవ



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలో శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా వైభవంగా పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమ లింగేశ్వర, నరసింహాస్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులు స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ఈఓ వెంకటరమణ ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, పర్లపాడు భజన సంఘం సభ్యులు, భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశస్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. అక్కడికి వచ్చిన భక్తులకు ఆలయ ఆవరణలో, సంజీవరాయ అన్నదాన సత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నమో ఆంజనేయ

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.
స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాస రెండవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా వెండి కవచాలు, రంగురంగుల గజమాలలతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించేందుకు ఉదయం నుంచి బారులు తీరారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. అలాగే టూటౌన్ సమీసంలోని, బుడ్డాయపల్లెలోని, కొర్రపాడు రోడ్డుతో సాటు పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాస శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితా దేవికి ప్రత్యేక పూజలతో పాలు అలంకరణ చేశారు.

నీరు విడుదల

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంసాగర్ కుడికాలువకు శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఏఈఈ నాగేశ్వరరావు 100 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ రైతుల అవసరాల కోసం నీరు విడుదల చేసినట్లు తెలిపారు. రైతులు నీరు వృథా కాకుండా వాడుకోవాలని సూచించారు.

కొంగు బంగారం కొండగోపాలస్వామి

అట్లూరు : భక్తుల పాలిటి కొంగు బంగారంలా కొండగోపాలస్వామి విరాలజిల్లుతున్నారు. శ్రావణమాసం రెండవ శనివారం కొండగోపాలస్వామి ఆలయం గోవిందనామస్మరణతో మార్మోగింది. లంకమల్లేశ్వర అభయారణ్యంలో వెలసిన కొండగోపాలస్వామి ఆలయం ప్రతి ఏటా శ్రావణమాసంలో శనివారాల్లో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా రెండవ వారమైన శనివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నదానం

చాపాడు: దువ్వూరు మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన కల్లూరు సుధాకర్‌రెడ్డి, సావిత్రి దంపతులు శుక్రవారం స్థానిక కాశినాయన వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైశాలి, నాగిరెడ్డి, ఆశ్రమనిర్వాహకులువెంకటయ్య పాల్గొన్నారు.

5న పాలిటెక్నిక్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

మైదుకూరు : మైదుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీ నిర్వహించే స్పాట్ అడ్మిషన్లను పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సివిల్ ఇంజినీరింగ్-31, కెమికల్ ఇంజినీరింగ్-17, కంప్యూటర్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్-26, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్-32, మెకానికల్ ఇంజినీరింగ్-29, మెటలర్జికల్ ఇంజినీరింగ్-33 సీట్లు ఉండగా ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులతో కొన్ని సీట్లను భర్తీ చేసినట్లు ఆయన వివరించారు. మిగిలిన సీట్ల కోసం 5న ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ఎంట్రన్స్ పరీక్ష రాయకున్నా స్పాట్ అడ్మిషన్లకు అర్హులేనన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎస్‌ఎస్‌సీ సర్టిఫికేట్, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను, 4-10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్, ఏపీ పాలిసెట్-2025 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు తదితర ఒరిజినల్ ధ్రువపత్రాలు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని పుట్టాయపల్లె గ్రామంలోని సర్వే నంబర్ 353, 354, 315, 355 లలో గల ప్రభుత్వ భూమిలో శనివారం మండల తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఆయా సర్వేనంబర్లలో గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందన్న విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

హోమియో వైద్యం.. అందని ధైన్యం

ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా, దీర్ఘకాలిక మొండి వ్యాధులను నయం చేసుకునేందుకు ప్రజలు హోమియా వైద్యం వైపు మొగ్గుచూపుతున్నారు. ఖర్చు తక్కువగా ఉండడంతో ఇటీవల ఈ వైద్యానికి ప్రాధాన్యం పెరిగింది. అయితే 38 ఏళ్లుగా సేవలందించిన వైద్యశాల మూతపడడంతో రోగులు సేవలు పొందలేకపోతున్నారు.

- సిబ్బంది లేక మూతపడిన హోమియా వైద్యశాల
- ఇబ్బందులు పడుతున్న రోగులు



సిబ్బంది లేక మూతపడ్డ చిన్నకేశంపల్లె హోమియో వైద్యశాల

బద్వేలు అర్బన్ : బద్వేల్ పట్టణంతోపాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు 38 ఏళ్లుగా సేవలందించిన చిన్నకేశంపల్లె హోమియా వైద్యశాల సిబ్బంది లేక మూతపడింది. దాదాపు 40 రోజులుగా వైద్యశాల మూతపడినప్పటికీ ఎవరూ పట్టించుకోక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణానికి సమీపంలోని తొట్టిగారిపల్లె వద్ద 1987లో హోమియా వైద్యశాల ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి సేవలందిస్తున్నారు. రెగ్యులర్ డిస్పెన్సరీగా గుర్తింపబడిన ఈ వైద్య శాలకు ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఫార్మాసిస్టు, ఒక స్వీపర్ పోస్టు కేటాయించారు. చర్మ వ్యాధులు, కీళ్లనొప్పులు, అలర్జీ, కిడ్నీలో రాళ్లు, సయాటికా, మైగ్రేన్ తలనొప్పి, సోరియాసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు హోమియా మందులతో మెరుగైన ఫలితాలు వస్తుండటంతో రోగులు ఆసక్తి చూపుతున్నారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి చికిత్స నిమిత్తం వస్తున్నారు. రోజూ 35 నుంచి 40 మంది చికిత్స పందారు. ఏడాదిన్నర కిందట మెడికల్ ఆఫీసర్ బదిలీపై వెళ్లడంతో అప్పటి నుండి హోమియో వైద్యశాలలో కేవలం సీనియర్ ఫార్మాసిస్టు రోగులకు మందులు అందించారు. గత నెలలో జరిగిన బదిలీల్లో చిన్నకేశంపల్లె హోమియో వైద్యశాల సీనియర్ ఫార్మసిస్టు, స్వీపర్‌ను కడపకు బదిలీ చేయడంతో 40 రోజులుగా ఆసుపత్రి మూతపడింది. రోగులు సేవలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పోస్టులు భర్తీ చేయాలి



తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని చిన్నకేశంపల్లె హోమియో వైద్యశాలకు తక్షణమే సిబ్బందిని నియమించాలి. రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. 40 రోజులుగా సిబ్బంది లేకపోవడంతో ఆసుపత్రి తెరుచుకోలేదు. జిల్లా అధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలి.

\- ఎం.చిన్ని, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

ఇబ్బందులు పడుతున్నాం



చిన్నకేశంపల్లె హోమియో వైద్యశాల సిబ్బంది లేక 40 రోజులుగా మూతపడి ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గత కొన్నేళ్లుగా అలర్జీకి హోమియో మందులు వాడడంతో ఉపశమనం పొందేవాడిని. ప్రస్తుతం సిబ్బంది లేక మందులు లభించక సమస్య మొదటికి వస్తోంది. అధికారులు సిబ్బందిని నియమించాలి.

పి.సుబ్బయ్య, బద్వేలు

త్వరలోనే వైద్యుడిని నియమిస్తాం

హోమియా వైద్యశాలలో పనిచేస్తున్న సిబ్బందిని ఇటీవల ఉన్నతాధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో హోమియో వైద్యశాలలలో సిబ్బంది కొరత ఉంది. అక్కడి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా సిబ్బందిని నియమిస్తాం. రోగులకు సేవలందిస్తాం.

\- శేఖర్‌రాజు, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, కడప

విద్యతో ఉజ్వల భవిష్యత్తు



యానాదులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు రాధిక

కాశినాయన : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రెడ్డికొట్టాల ఫౌండేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక తెలిపారు. శనివారం మండలంలోని రెడ్డికొట్టాల ఎస్టీ కాలనీకి వెళ్లగా అక్కడ కొంత మంది ఇంటికి తాళాలు వేసి ఊరికి దూరంగా కిలోమీటరు దూరంలో ఏటిగట్టున బొగ్గులు కాలుస్తున్నారని తెలుసుకుని హెచ్ఎం రాధిక అక్కడికి వెళ్లారు. అక్కడ యానాదుల దుర్భర జీవితాన్ని ఆమె గమనించారు. వారితో ఆమె మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి, అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. యానాదులు సమాధానమిస్తూ తాము ప్రతి రోజు పనికి వెళితే కానీ పూటగడవదని, చదువు లేక జీవితాలు నాశనం చేసుకున్నామని, పిల్లలను తప్పకుండా పాఠశాలలో చేర్పిస్తామని తెలిపారు. స్పందించిన ప్రధానోపాధ్యాయురాలు రాధిక పిల్లలను పాఠశాలలో చేర్పించాలని, అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. పేదల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని పేర్కొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యం

- చంద్రబాబు మోసాలను ఎండగడదాం
- వైఎస్సార్‌సీపీ నాయకుల పిలుపు



బద్వేలు అర్బన్: చంద్రబాబు మోసపు హామీలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గోపవరం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోరుమామిళ్ల: కరపత్రాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి



బద్వేలు అర్బన్: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వర్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు గుర్రంపాటి సుందర్‌రామిరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో గల ఆంజనేయనగర్‌లో శనివారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసం గురించి వివరించారు. ఒక్కో కుటుంబం చంద్రబాబు హామీలు అమలుకాకపోవడంతో ఎంత మేర నష్టపోయిందని క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయించి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించారని, నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై రెడ్‌బుక్ పేరుతో వేధిస్తూ అక్రమ కేసులు బనాయించడం తప్ప ప్రజలకు చేసింది శూన్యమన్నారు. హామీలు ఎప్పుడు అమలు చేస్తారంటూ కూటమి నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంత మేర లబ్ధి పొందారు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఎంత మేర నష్టపోయారో గుర్తించాలని కోరారు. అనంతరం చంద్రబాబు మోసపు హామీలతో ప్రజలు ఎంత మేర నష్టపోయారు అనే జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి, కో ఆప్షన్ మెంబర్ మాలేరామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ తోటనాగేశ్వర్‌రావు, మున్సిపాలిటీ వింగ్ ప్రెసిడెంట్ సాంబశివారెడ్డి, మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్ తమ్మిశెట్టిసునీల్, బూత్ కన్వీనర్లు శ్రీను, శివకోటిరెడ్డి, సాంబశివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, రామిరెడ్డి, నరసింహారెడ్డి, మల్లికార్జునరెడ్డి, కొండారెడ్డి, చిన్నపరెడ్డి, వెంకటరెడ్డి, 18, 15 వార్డుల ఇన్‌చార్జిలు రజనీకాంత్, రెడ్డెయ్య, బూత్ కన్వీనర్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారం కోసం బూటకపు హామీలు

అధికారం కోసం బూటకపు హామీలిచ్చి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బోడపాటిరామసుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు పోకలమల్లేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ దిగుబ బోయనపల్లె గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామస్తులను సమావేశపరిచి చంద్రబాబు ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసం గురించి వివరించారు. ఒక్కో కుటుంబం చంద్రబాబు హామీలు అమలుకాకపోవడంతో ఎంత మేర నష్టపోయిందని క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయించి చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ ఇన్‌చార్జి కుప్పాలరమణ, బూత్ కన్వీనర్లు రామచంద్రారెడ్డి, చెన్నయ్య, వెంకటసుబ్బయ్య, వీరయ్య, బాలకృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: ప్రజలను సూపర్ సిక్స్ పేరుతో కూటమి నాయకులు మోసం చేశారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పుల్లివీడు పంచాయతీలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం పేరుతో నాగార్జునరెడ్డి పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి కూటమి నాయకుల మోసపు హామీలను వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను అక్రమ అరెస్టులతో భయభ్రాంతులను చేస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ కూటమి పాలన గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీతారామిరెడ్డి, డాక్టర్ మాబు, బాదుల్లా, బాబు, నబీసాబ్, రమణారెడ్డి, బడేసాబ్, రంగారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

గోపవరం : ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలివ్వడం ... అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబు నైజమని, అందుకే ఆయనను మోసానికి బ్రాండ్ అంబాసిడర్ అని అంటారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణారెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పుల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని బేతాయపల్లె గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు అందజేస్తామని చెప్పారని, ఇప్పుడు అందులో ఉన్న పథకాలు మీ అందరికి వచ్చాయా అని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలను అడగగా సూపర్ సిక్స్ లేదు, సూపర్ సెవెన్ లేదు, ప్రజలకు ఇచ్చిన హామీలు చంద్రబాబు ఎప్పుడు నెరవేర్చారని నాయకుల ఎదుట ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు పుష్కలంగా వచ్చేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుసేవా కేంద్రాలు మూతపడ్డాయని, కనీసం యూరియా కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలతో పాటు 143కు పైగా హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. పెన్షన్ల హామీని అమలు చేసినట్లు ప్రకటించినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల పెన్షన్లు తొలగించారని, కొత్త పెన్షన్లు ఇవ్వలేదని అన్నారు. ఇదే సమయంలో వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంత మేర లబ్ధి పొందారు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఎంత మేర నష్టపోయారో గుర్తించాలని కోరారు. అనంతరం చంద్రబాబు మోసపు హామీలతో ప్రజలు ఎంత మేర నష్టపోయారు అనే జాబితాను ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు నరసింహారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు వెంకటేష్, సునీల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మపాలే బిడ్డకు అమృతం



ప్రొద్దుటూరు రూరల్ : మాట్లాడుతున్న సీడీపీఓ అరుణ కుమారి



ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

ప్రొద్దుటూరు క్రైం : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి తెలిపారు. స్థానిక అరవింద ఆశ్రమం వీధిలో సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధకశక్తిని అందిస్తాయని తెలిపారు. బిడ్డ పుట్టిన కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, అంగన్‌వాడీ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష

ప్రొద్దుటూరు రూరల్ : తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణ కుమారి పేర్కొన్నారు. మండలంలోని లింగారెడ్డికొట్టాలు, క్వీన్ మేరి స్కూల్ వీధిలో శనివారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాన్పుకు ముందు తీసుకునే ఆహారపదార్థాలనే కాన్పు తర్వాత కూడా తీసుకోవచ్చన్నారు. పండ్లు అధికంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, వి.విజయలక్ష్మి, జీవీ రమాదేవి, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల విశిష్టత తెలుసుకోవాలి

చాపాడు: తల్లి పాల విశిష్టత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, అంగన్వాడీ వర్కర్లు తమ గ్రామాల్లోని తల్లులకు వివరించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సయ్యద్ ముంతాజ్ బేగం పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం తల్లి పాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టినప్పటి నుంచి తల్లిపాలు తాపించడం ఎంతో అవసరమని తెలిపారు. ఉర్దూ హైస్కూల్ హెచ్ఎం కమాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, వరలక్ష్మీ, కళ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైన సింగసాని గురుమోహన్, కల్లూరు నాగేంద్రారెడ్డి శనివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిశారు. తమ నియామకానికి సహకరించిన రాచమల్లుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డిని వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల జనరల్ సెక్రటరీగా నంద్యాల రవీంద్రారెడ్డి కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాలూరు ఇంద్రసేనారెడ్డి, నంద్యాల ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇసుక ట్రాక్టర్లను వదిలిందెవరు?

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పోలీసు, రెవెన్యూ అధికారులు వెంబడించి గత వారంలో ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. పై అధికారులు ఆలస్యంగానైనా పట్టుకున్న ట్రాక్టర్లకు జరిమానా విధించకుండా రాజకీయ నేతల ఒత్తిడికి తలొగ్గి వదిలేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రొద్దుటూరు మండలం పెన్నానది పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ప్రతి గ్రామంలో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు ప్రభుత్వం మాదేనంటూ ఉద్యోగులపై పెత్తనం చేస్తున్నారు. ఎట్టకేలకు గత వారంలో రూరల్ పోలీసులతోపాటు రెవెన్యూ సిబ్బంది పెన్నానది పరిధిలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద దాడులు నిర్వహించి ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. పోలీసులు ట్రాక్టర్ల వివరాలను రాసి రెవెన్యూ అధికారులకు రికార్డు పంపారు. రెవెన్యూ అధికారులు మాత్రం పట్టుకున్న ఐదు ట్రాక్టర్లలో రెండింటికి మాత్రమే జరిమానా విధించి మిగతా మూడింటిని వదిలేశారు. కేవలం అధికార పార్టీనేతల ఒత్తిడితేనే అధికారులు ట్రాక్టర్లను వదిలేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఉన్నత స్థాయిలో ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలని ఆదేశాలు జారీ చేస్తున్నా కింది స్థాయిలో అమలు కావడం లేదనేదానికి ఇదే ఉదాహరణ. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొదటి సారి పట్టుబడిన ట్రాక్టర్లకు రూ.10వేలు, రెండో మారు పట్టుబడితే రూ.50వేలు వరకు జరిమానా విధించేలా నిబంధనలు ఉన్నాయి. ఎన్ని ట్రాక్టర్లు పట్టుకున్నాం, ఎన్నింటికి జరిమానా విధించారనే విషయంపై రెవెన్యూ, పోలీసు అధికారులు గోప్యంగా ఉంచడంపై పలువురు చర్చించుకుంటున్నారు.

స్వామిత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లోని రిజిస్ట్రర్లకు నోచుకోని గ్రామ కంఠాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వామిత్వ పథకం ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుందని డీఎల్‌పీఓ నూర్జహాన్ పేర్కొన్నారు. మండలంలోని చౌడూరు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన స్వామిత్వ గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ స్వామిత్వ యాప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లను, ఇళ్ల స్థలాలను సర్వే చేసి నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో రిజిస్ట్రర్లకు నోచుకోని గ్రామ కంఠాల్లోని ఇళ్లకు, ఇళ్ల స్థలాలకు పీపీఎం (పర్సనల్ ప్రాపర్టీ మ్యాప్) గ్రామ పంచాయతీ ద్వారా మంజూరు చేస్తామని పేర్కొన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి

మైదుకూరు : వ్యవసాయ అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వి.శశిభూషణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల సందర్భంగా రైతులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని అన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు 20 విడతలుగా కిసాన్ సమ్మాన్ యోజన కింద ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఖరీఫ్, రబీలో ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలను అందిస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అనుసరించాలని సూచించారు. కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న సహాయ సహకారాల గురించి వివరించారు. మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, బీజేపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి, మైదుకూరు ఉద్యాన అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల నీటి తొట్టిని బాగు చేశారు

చాపాడు: మండలంలోని అయ్యవారిపల్లెలో మురుగునీటితో దుర్భరంగా మారిన పశువుల నీటి తొట్టిని బాగు చేశారు. అయ్యవారిపల్లె గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ బంగ్లా వద్ద నిర్మించిన పశువుల తొట్టిలో అపరిశుభ్రమైన నీరు నిలిచి పశువులు తాగేందుకు పనికిరాకుండా దుర్గంధం వెలువడుతోంది. పశువుల తొట్టి దుస్థితిపై గురువారం సాక్షి దినపత్రికలో 'పశువుల తొట్టి ఇలా.. దాహార్తి తీరేదెలా' అనే కథనం వెలువడింది. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి వేణు పశువుల తొట్టి వద్ద గల మురికి నీటి తొలగింపజేసి, ప్రమాదరకమైన లార్వాలు చనిపోయేలా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.